క్లుప్తంగా

కమల ప్రసన్న నగర్ కాలనీ సమస్యలను పరిష్కరించాలి



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్‌లోని కమల ప్రసన్న నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శేఖర్ కాలనీ సభ్యులతో కలిసి కాలనీలోని సమస్యలపై డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవికి సోమవారం వినతిపత్రం అందజేసి సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. కార్పొరేటర్ స్పందిస్తూ త్వరలో సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

లక్ష్మి కుటుంబానికి ఆర్థిక సాయం



లక్ష్మి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న సతీష్‌రావు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్, ఎన్టీఆర్ నగర్‌లోని ఉత్కార్ లక్ష్మి(49) ఇటీవల కల్తీ కల్లు తాగి ఈఎస్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ డిశ్చార్జ్ అయ్యింది. ఇంటికి వచ్చాక ఫిట్స్‌తో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఖాజా, రాములుగౌడ్, రాజు, స్వామి, కృష్ణ తదితరులు ఉన్నారు.

డాక్టర్ రామలింగచారికి గ్లోబల్ ఎక్సలెన్సీ అవార్డు



ఓల్డ్ బోయిన్‌పల్లి: ఇంటర్నేషనల్ అవార్డు గ్రహీత, అయోధ్య బాలరాముని స్వర్ణపాదుకల రూపశిల్పి డాక్టర్ బ్రహ్మశ్రీ పిట్టంపల్లి రామలింగచారిని గ్లోబల్ ఎక్సలెన్సీ అవార్డుతో సత్కరించారు. తెలుగు సాంస్కృతిక సాహితి సేవా ట్రస్ట్ ఇంటర్నేషనల్ అవార్డు బెంగళూర్ ఆధ్వర్యంలో ఆదివారం బెంగళూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ మాచవరం గౌరిశంకర్ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో మోహన్‌రావు శర్మ, స్థపతి తదితరులు పాల్గొన్నారు.

స్క్రాప్ పైపులు కట్ చేస్తుండగా వ్యక్తి మృతి

మరో వ్యక్తికి గాయాలు

మూసాపేట: చెత్తలో వచ్చిన పైపులను ముక్కలు చేస్తుండగా బ్లాస్ట్ కావడంతో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తి గాయాల పాలైన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన మొబిన్(34) జీడిమెట్ల, సుభాష్‌నగర్ కాలనీలో నివాసం ఉంటూ కూలి పని చేస్తున్నాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన జమీల్(27) గ్యాస్ కట్టర్‌గా పనిచేస్తూ జీడిమెట్ల సుభాష్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. కాంట్రాక్టర్ సూచన మేరకు కూకట్‌పల్లి ఐడీఎల్ కంపెనీలో సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో స్క్రాప్ పైపులను గ్యాస్ కట్టర్‌తో ముక్కలు చేస్తుండగా ఒక్కసారిగా బ్లాస్ట్ అయ్యింది. మొబిన్ మృతి చెందగా జమీల్‌కు కాళ్లకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

రంగారెడ్డినగర్: శిథిలమైన డ్రైనేజీ లైన్‌ను పునరుద్ధరించి రోడ్డు పనులను ప్రారంభించడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి సంజయ్‌గాంధీ నగర్– జగద్గిరిగుట్ట రోడ్డులో తరచూ డ్రైనేజీ పొంగి పారుతుండటంతో రోడ్డు శిథిలమై రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. దీంతో నెల రోజుల క్రితం కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. దీంతో జగద్గిరిగుట్ట, ఐడీపీఎల్ మీదుగా బాలానగర్‌కు వెళ్లే వాహనదారులను గాంధీనగర్ రోడ్డు మీదుగా దారి మళ్లించారు. దీంతో ఈ ప్రాంతం రద్దీగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సీసీ రోడ్డు పనులను ఏఈ స్వాతితో కలిసి సంజయ్‌గాంధీనగర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణ, వెంకట్ సోమవారం ప్రారంభించారు. రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఏఈ పేర్కొన్నారు. కార్యక్రమంలో బస్తీ ఉపాధ్యక్షుడు కిరణ్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

నిత్యం ఇదేం అవస్థ..?

- ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు
- నిర్లక్ష్యం వీడని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉషా ముళ్లపూడి రోడ్డు గుంతలమయంగా మారి మ్యాన్‌హోల్స్ కుంగి వాహనదారులు పరిసర ప్రాంత కాలనీవాసులు నెలల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. ఈ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పూర్తిగా పాడై నిత్యం మురుగునీరు పరిసర ప్రాంత కాలనీల్లోకి చేరుతోంది. దీంతో దోమల బెడద తీవ్రంగా ఉంది. అధికారులు స్పందించి ఇబ్బందుల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. డ్రైనేజీ లైన్‌ను ఆనుకొని తాగునీటి పైపులైన్ కూడా ఉంది. ఆ పైప్‌లైన్‌కు లీకేజీ ఉండటంతో తాగునీరు కలుషితం అవుతోంది. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేయగా తూతూమంత్రంగా మరమ్మతులు చేసి వెళ్తున్నారని, వారి నిర్లక్ష్యం కారణంగా ఇబ్బందులు తప్పడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



రోడ్డు కుంగిపోవడంతో గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మాధవినగర్ పరిసర ప్రాంత కాలనీల ప్రజలకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– రాంమోహన్‌రావు ముప్పనేని, మాధవినగర్ కాలనీ నివాసి





మాధవినగర్, గోవింద్ హోటల్ చౌరస్తా వద్ద రోడ్డుపై పారుతున్న వరద

పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలి

- ఏఐటీయూసీ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ నిజాంపేట్ అధ్యక్షుడు అశీ యాదయ్య ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎండీ షబీర్ అలీని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఈ.ఉమా మహేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు సరైన సమయంలో జీతాలు రావడంలేదని, మున్సిపల్ అధికారులు, బ్యాంక్ అధికారులకు కొంత సమన్వయ లోపం ఉందన్నారు. తక్షణమే కార్మికులకు జీతాలు చెల్లించాలని కోరారు. ఇల్లు లేని కార్మికులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని, కార్మికులకు కిట్లు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్, ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.స్వామి, వి.శ్రీనివాస్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ ఎండీ షబీర్ అలీకి వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఐవీఎఫ్, సరోగసీపై ప్రభుత్వం నిఘా ఉంచాలి

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఏసురత్నం



షాపూర్‌నగర్‌లో సమావేశమైన సీపీఐ నాయకులు

కుత్బుల్లాపూర్: ఐవీఎఫ్, టెస్ట్‌ట్యూబ్‌ల పేరుతో పిల్లలు పుట్టిస్తామని అమాయక దంపతులను మోసం చేస్తున్న ఫెర్టిలిటీ సెంటర్ల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఏసురత్నం అన్నారు. షాపూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఉమామహేష్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని సృష్టి ఫర్టిలైటీ సెంటర్‌లో వేరే వారి డీఎన్ఏతో సరోగసీతో ఐవీఎఫ్ చేశారని, తల్లిదండ్రులు డీఎన్ఏ టెస్ట్ చేయించడంతో బాగోతం బయట పడిందన్నారు. గతంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నా అధికారులు పట్టించుకోలేదని అన్నారు. అక్రమ పద్ధతుల్లో సరోగసీ, ఐవీఎఫ్‌లు నిర్వహిస్తున్న సెంటర్లపై కఠినంగా వ్యవహరించాలని, వైద్య సేవలు అందించకుండా వారి లైసెన్స్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శులు స్వామి, శ్రీనివాస్, ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు నరసింహారెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

వైకుంఠధామానికి 3.20 ఎకరాలు కేటాయించాల్సిందే..

- ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి ఫిర్యాదు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో 2017, 2020 కలెక్టర్/ఆర్డీఓ ఉత్తర్వుల ప్రకారం హిందూ వైకుంఠధామానికి 3.20 ఎకరాలు కేటాయించకుండా 1.20 ఎకరాలు కేటాయిస్తామన్న రెవెన్యూ అధికారుల వైఖరికి నిరసనగా ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి ఆకుల సతీష్ సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్ మూడు గ్రామాలకు కలిపి వైకుంఠధామం కోసం 10ఎకరాల స్థలాన్ని 2017 అప్పటి కలెక్టర్ కేటాయించారన్నారు. 10 ఎకరాల వైకుంఠధామంలో హిందువులకు 3.20 ఎకరాలు, ముస్లింలకు 3.20 ఎకరాలు, క్రిష్టియన్లకు 3.20ఎకరాలు కేటాయిస్తూ 2020లో ఆర్డీఓ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. కానీ ఇప్పటి వరకు హిందువుల వైకుంఠధామం కోసం ఎకరం కూడా కేటాయించకపోవడం బాధాకరం అన్నారు. 2023లో ముస్లింల ఈద్గా కోసం 2 ఎకరాలు కేటాయించారని, హిందువులకు కేటాయించకపోవడం హిందువులపై అధికారులకు చిన్నచూపుగా కనిపిస్తోందన్నారు.



ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న ఆకుల సతీష్

ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలి..

వీఎన్ఆర్ విద్యా సంస్థల్లో ప్రభుత్వ భూమి, యుఎల్‌సీ భూమి దాదాపు 11ఎకరాలను ఆక్రమించుకొని చేపట్టిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ కోరారు. వీఎన్ఆర్ కాలేజీ, స్కూల్‌కు సంబంధించి రెవెన్యూ రికార్డుల ప్రకారం 38.11 ఎకరాలు ఉండాలి. కానీ వారి పూర్తి విస్తీర్ణం 52ఎకరాలు ఉండటంపై సర్వే నిర్వహించాలని కోరారు. అరుణ్‌రావు, చందు, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

సుభాష్‌నగర్: ఓ యువకుడు అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మెట్‌కానిగూడ సుప్రియ ఎంపైర్ అపార్ట్‌మెంట్‌లో ఉండే వెంకటరమణ కుమారుడు పోగుల తరుణ్ శనివారం మధ్యాహ్నం తన కారులో బయటకు వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయడంతో స్విచ్ఛ్ ఆఫ్ వచ్చింది. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం సూరారం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్షయ్ ఎన్‌క్లేవ్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



అక్షయ్ ఎన్‌క్లేవ్ నూతన కమిటీ సభ్యులు

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని అక్షయ్ ఎన్‌క్లేవ్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు తక్కలపల్లి సూర్యప్రకాష్‌రావు, ఉపాధ్యక్షుడు మల్లుల చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీ అక్బర్ షరీఫ్ తదితరులను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు టి.సూర్యప్రకాష్‌రావు మాట్లాడుతూ అందరూ ఏకతాటిపై నిలబడి అక్షయ్ ఎన్‌క్లేవ్‌ను అధికారుల సహకారంతో అభివృద్ధి చేసుకుందాం అన్నారు.

శానిటేషన్ సిబ్బందికి రక్షణ కిట్ల పంపిణీ

మోతీనగర్: జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది 102 మందికి కార్పొరేటర్ సబిహాబేగం ప్రభుత్వం అందజేసిన రక్షణ కిట్లను వార్డు కార్యాలయంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిట్‌లో సబ్బులు, శానిటైజర్లు, రెయిన్ కోట్, రేడియం జాకెట్, టవల్, మాస్కులు, గ్లౌజ్‌లు, టోపీ, షూస్, బ్యాగ్, హెయిర్ ఆయిల్ తదితర వస్తువులు ఉన్నాయని తెలిపారు. సిబ్బంది సురక్షితంగా ఎలా పనిచేయాలో, వ్యక్తిగత శుభ్రత పాటించాల్సిన విధానాలు, ప్రాథమిక జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ సురేష్, ఎస్ఎఫ్ఏలు అరుణ్, నరేందర్, షరీఫ్, బాబా, కృష్ణారావు, బొల్లు శ్రీనివాసరావు, టీఆర్ఎస్ రాజు, సంజీవ్‌రెడ్డి, యూసఫ్, సత్యనారాయణ పాల్గొన్నారు.



జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బందికి రక్షణ కిట్లను పంపిణీ చేసిన కార్పొరేటర్ సబిహాబేగం

కల్తీకల్లు బాధితులకు పరిహారం అందజేయాలి



కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కూకట్‌పల్లి: కల్తీ కల్లు బాధితులకు పరిహారం అందజేయాలని కోరుతూ సోమవారం సీపీఎం కూకట్‌పల్లి మండల కమిటీ నాయకుల ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కూకట్‌పల్లి మండల ప్రాంతమైన హైదర్‌నగర్, ఎల్లమ్మబండ, భాగ్యనగర్ కాలనీ, ఇంద్రానగర్ తదితర బస్తీల్లో ఉన్న కల్లు కాంపౌండ్లలో మత్తు పానీయాలు మురికి నీటిలో కలిపి కల్తీ కల్లు తయారు చేసి విక్రయించడంతో 14 మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. వందలాది మంది అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. నిరుపేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోలేకపోగా యజమానులకు తొత్తులుగా వ్యవహరిస్తూ బాధితులకు ఇప్పటి వరకు పరిహారం చెల్లించేందుకు ముందుకు రాలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి కల్లు కాంపౌండ్ల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. మృతి చెందిన కుటుంబాలకు రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యవర్గ సభ్యుడు ఐ.రాజశేఖర్, కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం.శంకర్, మండల కమిటీ నాయకుడు పల్లి ధర్మారావు, కృష్ణానాయక్, బి.రాములు, వి.లక్ష్మీపతిరావు, జే.మల్లేష్, తమ్మినేని కృష్ణారావు, రాఘవరావు పాల్గొన్నారు.

అద్దె గదుల్లో అంగన్‌వాడీలు

- నీటి కొరతతో ఇబ్బంది పడుతున్న పిల్లలు, గర్భిణీలు
- 793 అంగన్‌వాడీ కేంద్రాలు, 78,885 మంది లబ్ధిదారులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె డబ్బులు చెల్లించకపోవడం ఓ వంతు అయితే.. సొంత భవనాలున్న కేంద్రాలకు కూడా సరైన వసతులు కల్పించలేని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా, అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్న టీచర్లు, ఆయాల (హెల్పర్లు)కు కూడా నెలనెలా జీతాలు అందించలేకపోతున్నారనే విమర్శలున్నాయి.

- మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. ఇందులో 6 నెలల నుంచి 6 ఏళ్ల పిల్లలు 68,913 మంది, గర్భిణీలు, బాలింతలు 9,972 మంది ఉన్నారు. మొత్తంగా 78,885 మంది ఉండగా.. ఇందులో కుత్బుల్లాపూర్ ప్రాజెక్ట్ పరిధిలో 313 కేంద్రాలు ఉండగా.. 33,226 మంది పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, మేడ్చల్‌లో 211 అంగన్‌వాడీ కేంద్రాల్లో 15,481 మంది, అల్వాల్ పరిధిలో 269 అంగన్‌వాడీ కేంద్రాల్లో 30,178 మంది పిల్లలు, గర్భిణీలు, బాలింతలు ఉన్నారు.

సొంత భవనాలు లేనివే అధికం..

793 అంగన్‌వాడీ కేంద్రాల్లో 212 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. ఇవి కాకుండా దాతలు ఉచితంగా ఇచ్చిన 138 భవనాల్లో కూడా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మిగిలిన 443 అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 311 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. అత్యధికంగా 277 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

- అల్వాల్‌లో 271 కేంద్రాల్లో 143 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. మేడ్చల్‌లో 211 అంగన్‌వాడీ కేంద్రాలకు 23 మాత్రమే అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

తాగునీటికి ఇబ్బందే..

మేడ్చల్ ప్రాజెక్టు పరిధిలో 211 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అత్యధికంగా 77 కేంద్రాల్లో తాగునీటి సదుపాయం లేదు. అల్వాల్ ప్రాజెక్టు పరిధిలో 40 కేంద్రాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉంది.

శానిటేషన్ అంతంత మాత్రమే..

మేడ్చల్ ప్రాజెక్టు పరిధిలో 78, అల్వాల్ ప్రాజెక్టు పరిధిలో 51, కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 40 అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్ల సమస్య తీవ్రంగా ఉంది. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఇచ్చే అద్దె చాలా తక్కువ కావడంతో యజమానులు సరైన సౌకర్యాలు కల్పించడం లేదు.

దవాఖానాల్లో ఆధార్ బేస్డ్ అటెండెన్స్!

ఆగస్టు 1 నుంచి అమలు చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం

ఈ నెల 31లోగా వైద్యులు, సిబ్బందికి శిక్షణపై కసరత్తు

సాక్షి, మేడ్చల్ జిల్లా: వైద్య సేవల్లో మరింత పారదర్శకతను పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆగస్టు 1 నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్ (ఏబీఏఎస్) విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఆయా జిల్లా వైద్యారోగ్యశాఖ యంత్రాంగం ప్రభుత్వ ఆసుపత్రులతో సహా పీహెచ్‌సీలు, బస్తీ, పల్లె దవాఖానాల్లో ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్ (ఏబీఏఎస్) విధానాన్ని ప్రవేశ పెట్టే దిశగా ఆలోచిస్తోంది.

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఓ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి (మల్కాజిగిరి)తో ఘట్‌కేసర్, మేడ్చల్, శామీర్‌పేట్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు , 26 ప్రభుత్వ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 12 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, 70 పల్లె దవాఖానాలు, 112 బస్తీ దవాఖానాలు స్థానిక ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాయి.
- రంగారెడ్డి జిల్లాలో ఓ కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రితో పాటు ఓ ఏరియా ఆసుపత్రి 9 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 55 పీహెచ్‌సీలు, 231 సబ్ సెంటర్లు, 57 బస్తీ దవాఖానాలు ఉన్నాయి. ఇవన్నీ వైద్య, విద్యా సంచాలకులు, వైద్య విధాన పరిషత్, ప్రజారోగ్య సంచాలకులు, ఆయుష్ విభాగాల పరిధిలో పనిచేస్తుండగా.. వీటన్నింటిలోనూ..'ఏబీఏఎస్' విధానాన్ని ప్రవేశపెట్టాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీనికి సంబంధించి వైద్యులు, సిబ్బందికి ఈనెల 31లోగా అవసరమైన శిక్షణ అందించనుంది.



పారదర్శకతే లక్ష్యంగా..

ప్రస్తుతం దవాఖానాల్లో వైద్యులు, సిబ్బందికి బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు అమలు పరుస్తున్నారు. ఆసుపత్రికి వచ్చిన సమయంలో తిరిగి వెళ్లేటప్పుడు హాజరు వేస్తున్నారు. ఈ విధానంలో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని ప్రభుత్వం గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ విధానం ద్వారా డాక్టర్లు, సిబ్బంది తమకు నిర్దేశించిన సమయాలకు అనుగుణంగా వైద్యసేవలు అందించడంతో పాటు ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్య సేవలు పొందడంలో ఇబ్బందులు ఉండవని ప్రభుత్వం భావిస్తోంది.

మచ్చుకు కొన్ని..

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు 12 ఉండగా, ఇందులో 11 కేంద్రాల్లో ప్రసవాలు చేస్తున్నప్పటికీ డాక్టర్లు అందుబాటులో లేని కారణంగా గర్భిణులు, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుంది. 26 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఇందులో ఆరింటిలో ప్రసవాలు చేస్తున్నామని, జిల్లా వైద్యారోగ్యశాఖ పేర్కొంటున్నప్పటికీ, ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదని తెలుస్తోంది. జిల్లాలో 24 గంటలు (రౌండ్ ది క్లాక్) ఆసుపత్రులు 12 ఉండగా, ఇందులో 4 ఆసుపత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం, మరికొన్నింటిలో ఆలస్యంగా వారు రావడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే పరిస్థితి రంగారెడ్డి జిల్లాలో కూడా నెలకొంది. ఈ నేపథ్యంలోనే సర్కారు దవాఖానాల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు వైద్య సేవల్లో మరింత పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం 'ఏబీఏఎస్' విధానం అమలుకు కసరత్తులు చేస్తుంది.

సమయపాలన లేకపోవడంతో కష్టాలు

మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో మల్కాజిగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రితో సహా కమ్యూనిటీహెల్త్ సెంటర్, పీహెచ్‌సీలు, బస్తీ, పల్లె దవాఖానాల ద్వారా ప్రజలు అంతంత మాత్రంగానే వైద్య సేవలను పొందుతున్నారు. గ్రామీణ, అర్బన్ ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పర్యవేక్షణ కొరవడటంతో డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించక రోగులు వైద్య పరీక్షలు, ఇతర వైద్య సేవల కోసం నిరీక్షించాల్సి వస్తుంది.